క్లుప్తంగా

డీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

ఖమ్మంరూరల్: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ శ్రీరాంనగర్‌కు చెందిన బాణాల సరయు 109 ర్యాంక్ సాధించింది. ఆమెను యువజన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా సురేష్‌నాయక్, గ్రామపెద్దలు ఎస్‌పీ చారి, శేషిరెడ్డి, రమేష్, పైదిరెడ్డి, శిలింగం అభినందించి ఘనంగా సన్మానించారు.

వృద్ధురాలిపై కుక్క దాడి

నేలకొండపల్లి: వృద్ధురాలిపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగాపురతండాకు చెందిన బి.రుక్మిణి (65) అనే వృద్ధురాలిపై గురువారం వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. దీంతో ఆమెకు గాయాలు కావడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

రేపు నెలనెలా మెడికల్ క్యాంపు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం టూటౌన్ కమిటీ–బీవీకే ఆధ్వర్యాన ప్రతి నెలా నిర్వహించే నెలనెలా ఉచిత వైద్య శిబిరం శనివారం నగరంలోని మంచికంటి హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ ఆస్పత్రి సౌజన్యంతో ఈ శనివారం డయాబెటిక్, కంటి నరం, కిడ్నీ సిరం క్రియాటినైన్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి శిబిరం ప్రారంభంకానుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రమేష్, ఇబ్రహీం

కామేపల్లి: కామేపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుముల రమేష్, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడిగా మేకల మల్లిఖార్జున్, సహాయ కార్యదర్శిగా గుండ్ల సుధాకర్, కోశాధికారిగా కొమ్మినేని శివనాగశేషు, గౌరవ అధ్యక్షుడిగా తెల్లబోయిన రాము, గౌరవ సలహాదారుడిగా కోటగిరి రామును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా బండి గురునాథ్, రాయల భిక్షమయ్య, చిలుముల శ్రీనివాసరావు, కొర్ర గోపి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన గొర్రె బాబురావు ఇటీవల మృతి చెందగా.. గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు గురువారం 50 కేజీల బియ్యం వితరణగా అందించారు. గత ఏడేళ్ల నుంచి నిరుపేదల కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే తన వంతు సాయంగా ఇలా బియ్యాన్ని వితరణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ వార్డు మెంబర్లు కాలింగి వీరబాబు, గుండ్ల ముత్తయ్య, రాచర్ల రామ్మూర్తి, వాసు, రామకృష్ణ, నరసింహారావు, వీరబాబు, గొర్రె బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర పార్ట్–1
వినోద	దేవర పార్ట్–1
సాయిరాం	దేవర పార్ట్–1
ఆదిత్య	జోకర్ ఫోలియో ఏ డీలక్స్, మత్తు వదలరా – 2
శ్రీనివాస	దేవర పార్ట్–1, సత్యం సుందరం

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	68	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	40	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	50		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	60		

–ఖమ్మం వ్యవసాయం

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి



పండక్కి పస్తులేనా..?

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నారు. అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరిగినా తమగోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. జీతాల కోసం తరచూ ఆందోళనలకు దిగడం, ఆ తర్వాత అధికారులు కంటితుడుపు చర్యగా ఒక నెల జీతం వారి ఖాతాల్లో వేయడం సర్వసాధారణమైపోయింది. కానీ వారి సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించట్లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

– ఖమ్మంవైద్యవిభాగం

పెద్దాస్పత్రి కార్మికులకు మూడు నెలలుగా జీతాలు బంద్

- ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో తరచూ సమస్యలు
- ధర్నా సమయాన కంటితుడుపు చర్యగా నెల జీతం చెల్లింపు
- దసరాకు పస్తులు ఉండాల్సి వస్తుందేమోనని కార్మికుల ఆందోళన

ఏజెన్సీకి అప్పగించడంతో..

పెద్దాస్పత్రి వివిధ విభాగాల్లో 256 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరి నిర్వహణను ఓ ఏజెన్సీకి అప్పగించగా.. వారు ప్రతి నెలా జీతాలు చెల్లిస్తారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ బాధ్యతలు ఆయా కార్మికులు నిర్వర్తిస్తుంటారు. అంతేకాక ఆస్పత్రికి భద్రత కల్పించడం, పరిశుభ్రంగా ఉంచడం, రోగులకు సహకారం అందించడం వీరి విధి. అయితే నెల నెల జీతాలు సక్రమంగా రాకపోవడంతో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నిరుపేదలైన వీరిలో చాలా మంది వివిధ గ్రామాల నుంచి వస్తుండగా, మరి కొందరు అద్దెకు ఉండి విధులు నిర్వహిస్తున్నారు. అసలే చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తుండగా ఇలా జీతాలు రాకపోవడంతో అద్దె చెల్లింపుతో పాటు కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో..

పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న ఒక్కో కార్మికుడికి నెలకు రూ.14,500 చెల్లిస్తుండగా.. కటింగులు 1,500 వరకు ఉంటాయి. అయితే ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లిన తర్వాత జీతాల చెల్లింపుల విషయంతో మరిన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు ఆస్పత్రిలో 575 బెడ్లకు అనుమతి ఉండేది. ఆ బెడ్ల సామర్థ్యాన్ని బట్టి 256 మంది కార్మికులకు జీతాలు చెల్లించేవారు. ఆయా బెడ్లకు సంబంధించి ఏజెన్సీకి నెల నెల రూ.50 లక్షలు చెల్లించే వారు. అయితే గత ఏడాది నవంబర్ నుంచి పెద్దాస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లిపోయింది. మెడికల్ కళాశాలకు 100 సీట్లు కుటాయించగా.. ఆ మేరకు 430 బెడ్లకు మాత్రమే చెల్లింపులకు అనుమతి ఇచ్చారు. దీంతో ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు రూ.35 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో నెల నెల రూ. 15 లక్షల వ్యత్యాసం వస్తుండగా ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలు చెల్లించలేకపోతున్నాడు. ఈ ఏడాది కాలంలో పలు సార్లు జీతాల కోసం కార్మికులు ఆందోళన చేపట్టడం, కంటితుడుపుగా ఒక నెల జీతం చెల్లించడం జరుగుతుంది. కానీ వారి సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ఇంత వరకు లభించట్లేదు. అయితే దసరా పండుగ వస్తుండగా కనీసం ఈ నెల అయినా జీతం వస్తుందని కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది..



జీతాలు సక్రమంగా రాక కుటుంబ పోషణ ఇబ్బంది కరంగా మారింది. ఇంటి అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్నారు. ఏనాడు నెల నెల జీతాలు చెల్లించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు మాగోడు విని పండగకు పెండింగ్ జీతాలు చెల్లించాలి.

– వి. రాధిక, పేషంట్ కేర్

శాశ్వత పరిష్కారం చూపాలి..



చాలా కాలంగా జీతాల సమస్య వేధిస్తోంది. దీంతో ధర్నా చేయడం.. వారు కంటి తుడుపుగా ఒక నెల జీతం చెల్లిస్తుండడం పరిపాటిగా మారింది. కానీ శాశ్వత పరిష్కారం చూపట్లేదు. దసరా పండగ ఎలా చేసుకోవాలో అర్థం కావట్లేదు. ప్రతీ నెల జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బి. వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ

త్వరలో సమస్య పరిష్కరిస్తాం..

కార్మికుల జీతాలకు సంబంధించి ఫైల్ ప్రస్తుతం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వద్ద ఉంది. వారి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఖమ్మం మెడికల్ కళాశాలకు 100 సీట్లు కేటాయించడంతో నిబంధనల ప్రకారం 430 బెడ్లకు మాత్రమే చెల్లింపు చేస్తున్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే ప్రతీ నెల చెల్లింపులు సజావుగా జరుగుతాయి.

– ఎల్. కిరణ్‌కుమార్, ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్

బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ మండపాలు, ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు శ్రీబాలా త్రిపురసుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వగా.. అభిషేకం, కుంకుమార్చన, హోమం తదితర ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా.. కొందరు భక్తులు అమ్మవారి మాలధారణ చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్





ఖమ్మంలో బాలాత్రిపుర సుందరీదేవి, ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారు



ఖమ్మంరూరల్ : రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో రజత కవచాలతో దర్శనమిస్తున్న అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: కవిరాజ్‌నగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



ఖమ్మంరూరల్: గుర్రాలపాడులో పూజలు చేస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ఖమ్మంఅర్బన్: మధురానగర్ సాయిమందిరంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



కామేపల్లి: మద్దులపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

తాగునీటి సరఫరాలో అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ సదాశివకుమార్

నేలకొండపల్లి: ప్రజలకు అందించే తాగునీరు సరఫరాలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మిషన్ భగీరథ ఎస్‌ఈ సదాశివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ పంపు ఆపరేటర్లకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రేష్టమైన తాగునీటి సరఫరా విషయంలో తెలుసుకోవాల్సిన మెళుకువలను ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా చెబుతున్నామన్నారు. చేతి పంపులు, బోరులను ఎలా మరమ్మతులు చేయాలి, నీటి నాణ్యతను ఎలా తెలుసుకోవాలనే విషయాలను తెలియజేస్తున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీ కార్యాలయాలలో వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డీఈఈ ఓం ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, పంపు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్, జీపీఎఫ్, సరెండర్ లీవ్ బిల్లులు, వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ ఖమ్మం అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, బి.రవికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఖమ్మంలో జరిగిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఎస్‌జీటీకి ఓటు హక్కు కల్పించాలని, పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని, సీపీఎస్ రద్దు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల నాయకులు వెంకటేశ్వరరావు, సైదులు, గోపాలస్వామి, నాగేంద్రబాబు, రంగారావు, దర్గయ్య, వెంకటకుమారి, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పొలాలు



మల్లాయిగూడెంలో నేలవాలిన వరి

కూసుమంచి: మండలంలో బుధవారం రాత్రి వీచిన గాలులు, కురిసిన భారీ వర్షానికి వరి పొలాలు నేలకొరిగాయి. ప్రస్తుతం పొలాలు పొట్టదశలో ఉండగా.. అకస్మాత్తుగా వచ్చిన గాలి దుమారానికి పంటంతా నేలవాలిందని రైతులు వాపోతున్నారు. వరదలు, ఈదురుగాలులతో ఈ ఏడాది పాలేరు, మల్లాయిగూడెం, హట్యాతండా తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఏడీఏ పరిశీలన..

గాలి దుమారానికి నేలకొరిగిన వరి పొలాలను గురువారం కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ వాణి పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏడీఏ తెలిపారు.

రెండో రోజు అటుకుల సంబరం

తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల్లో రెండో రోజైన గురువారం విద్యార్థులు తీరొక్క పూలతో అటుకుల బతుకమ్మలను అందంగా తయారు చేశారు. బతుకమ్మలకు పూజలు చేసి ఆడిపాడాక సమీపంలోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండగ ప్రాధాన్యతను ఆయా పాఠశాలల యాజమాన్యలు తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నారాయణ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



కూసుమంచి: గ్లోబల్ రెయిన్‌బో పాఠశాలలో బతుకమ్మలతో మహిళలు



ఖమ్మం రాపర్తినగర్: కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న సురేంద్రమోహన్, డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాలను ఎంచుకుని నిజాయతీగా కష్టపడి చదివితే విజయం సాధ్యమవుతుందని మైనింగ్, సాండ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ అన్నారు. గురువారం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో కెరీర్ ప్లానింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఉన్నత స్థానానికి ఏ విధంగా చేరుకున్నారో వివరించాక.. వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, టౌన్ ప్లానింగ్ అధికారి ఇటుకల భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై రాజకీయాలు వద్దు

నేలకొండపల్లి: వరదలపై కేంద్రం రాజకీయాలు చేయడం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిన వేణు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలపై కేంద్రం వివక్ష చూపడం సరికాదన్నారు. ఏపీకి రూ.1,036 కోట్లు, తెలంగాణకు కేవలం రూ.416 కోట్లు మాత్రమే నిధులు కేటాయించిందని, రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు ఉండి నిధులు సాధించలేకపోయారన్నారు. ఎన్నికల సమయాన మాత్రమే బీజేపీ నిధులు కేటాయిస్తుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమి సరిహద్దులు నిర్ధారించాలి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని 254 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో తహసీల్ ఎదుట ఆందోళన చేస్తామని అఖిలపక్షం నాయకులు తెలిపారు. తిరుమలాయపాలెంలో గురువారం పలువురు నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎంపీపీపై తాము చేసిన ఆరోపణలపై స్పందించిన నేపథ్యాన రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కొమ్ము శ్రీను, స్వామి, కొమ్ము పూలే, మట్టే నాగేశ్వరావు, నాగభూషణం, బాబు, బాబు, రాంగోపాల్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, అశోక్, వీరస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఎదుట హమాలీల ఆందోళన



ధర్నా చేస్తున్న హమాలీలు, నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)లో చాలా ఏళ్లుగా పని చేస్తున్న 100 మంది హమాలీలను అకారణంగా ఇటీవల బదిలీ చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ ఆరోపించారు. గురువారం కాల్వొడ్డు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద హమాలీల బదిలీలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో పని చేస్తున్న హమాలీలను కాజీపేటకు ఆకస్మికంగా బదిలీ చేయడం అంటే ఆ కుటుంబాలను రోడ్డున పడేసినట్లేనన్నారు. ఇకనైనా బదిలీలు ఆపకుంటే శుక్రవారం కూడా ఆందోళన చేస్తామని, తమ సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి, సీఐటీయూ నాయకులు విష్ణువర్ధన్, వెంకటేశ్వరరావు, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు అండగా..



నిత్యావసరాలు అందజేస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల సంభవించినవరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన మున్నూరు కాపులకు తన ఆధ్వర్యాన అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ సమకూర్చిన నిత్యావసర వస్తువులను మున్నూరుకాపు సంఘ ప్రముఖులు, ఆర్‌జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ ఖమ్మంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేసీ కృష్ణ మాట్లాడుతూ.. కుల బాంధవులకు తన వంతు సహాయ, సహకారాలు అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మెంతుల శ్రీశైలం, తోట రామారావు, మాటేటి నాగేశ్వరావు, కనకం భద్రయ్య, జనార్దన్, కిరణ్, యర్రా అప్పారావు, జంగిలి రమణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే షురూ..



సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 54వ డివిజన్‌ను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. దీనిలో భాగంగా గురువారం నుంచి ఈ డివిజన్‌లో కుటుంబ సర్వేను కేఎంసీ అధికారులు ప్రారంభించారు. ఇందుకు 13 బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందానికి 50 ఇళ్ల చొప్పున తిరిగేలా బృందానికి ఒకరు హెడ్‌తో పాటు ముగ్గురు లేదా నలుగురు సిబ్బందిని నియమించారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేస్తున్నారు. మొత్తంగా డివిజన్‌లో 1,500 నుంచి 2,000 వరకు కుటుంబాలు ఉంటాయని అధికారులు అంచనా వేశారు. కాగా, ఈ సర్వేను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించి సర్వే చేస్తున్న తీరును అగిడి తెలుసుకున్నారు.

నిద్రావస్థలో నిఘా..!

- కొత్త బస్టాండ్ ఆవరణలో దొంగల హల్‌చల్
- మాయమవుతున్న బైక్‌లు, పార్సిళ్లు
- పని చేయని సీసీ కెమెరాలు
- పోలీసు క్యాంప్ ఉన్నా ఆగని చోరీలు



కార్గో పాయింట్ వద్ద నిలిపిన బైక్‌లు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోనే ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్‌ను ఖమ్మంలో నిర్మించారు. అయితే ఈ బస్టాండ్‌లో దొంగల భయం ఎక్కువైంది. ఇక్కడ పార్సిళ్లతో పాటు ద్విచక్ర వాహనాలు మాయమవుతున్నాయి. దీనికితోడు ఇక్కడ 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అందులో సగం మాత్రమే పనిచేయడం గమనార్హం. బస్టాండ్‌లో పోలీసులు క్యాంప్ ఏర్పాటు చేసినప్పటికీ దొంగతనాలను మాత్రం అరికట్టలేకపోతున్నారు.

పార్సిళ్లు, బైక్‌ల అపహరణ..

నూతన బస్టాండ్‌లో నిత్యం ప్రయాణికులతో రద్దీ ఉంటుండగా దొంగలు ఇదే అనువైన ప్రదేశంగా భావించి నిత్యం చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో కార్గోలో పార్సిళ్లతో పాటు పార్కింగ్ చేసిన బైక్‌లు కూడా మాయమవుతున్నాయి. దీంతో బస్టాండ్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు హడలిపోతున్నారు. గత రెండు రోజుల క్రితం కార్గో పార్సిల్ తీసుకోవడానికి ఓ వ్యక్తి బస్టాండ్ వచ్చి తిగిరి బైక్ దగ్గరకు వచ్చేలోగా బైక్‌ను మాయం చేశారు. దీనిపై బస్టాండ్ ఎస్ఐ దానయ్యను వివరణ కోరగా.. బస్టాండ్‌లో బైక్ పోయిందని ఫిర్యాదు అందిందని, పరిశీలించేందుకు చూస్తే సీసీ పని చేయడం లేదని, సీసీలు పని చేసేలా మరమత్తులు చేయించాలని స్టేషన్ మేనేజర్‌కు సూచించామని, బస్టాండ్ ఆవరణలో నిఘాను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.